క్లుప్తంగా

వేలంలో పెరిగిన ఆదాయం



వేలం పాటలు నిర్వహిస్తున్న అధికారులు

దొర్నిపాడు: మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలోని శ్రీనాగేశ్వరస్వామి, శ్రీ చెన్నకేశవస్వామి ఆలయాలకు సంబంధించిన 50.91 ఎకరాల కు సోమవారం ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ శివశంకర్‌రెడ్డి అధ్యక్షతన ఈఓ చంద్రు డు కౌలు వేలం పాటలు నిర్వహించారు. గతేడాది రూ.9.61లక్షలకు వేలం జరగగా ప్రస్తుతం రూ.10.34 లక్షలకు పలికింది. దీంతో ఆలయాలకు రూ.73వేల ఆదాయం వచ్చినట్లు చెప్పారు. గతంలో జరిగిన ఘటనలను దృష్టిలో ఉంచుకొని ప్రస్తుత వేలాలను పోలీసు బందోబస్తు మధ్య నిర్వహించారు. సర్పంచ్ శివరామిరెడ్డి, ఉప సర్పంచ్ మహేష్ పాల్గొన్నారు.

వెదురు బొంగులకు వేలం

రుద్రవరం: స్థానిక అటవీ కార్యాలయ ప్రాంగణంలో సోమవారం నంద్యాల డీఎఫ్ఓ వినీత్‌కుమార్ వెదురు బొంగులకు వేలం నిర్వహించారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. మొదటి తరగతికి చెందిన బొంగులు 3వేలు, మూడో తరగతికి చెందిన 27వేలు కలిపి మొత్తం 30వేల వెదురు బొంగులకు వేలం నిర్వహించగా రూ.6.49 లక్షల ఆదాయం వచ్చింది. రుద్రవరం రేంజి అధికారి శ్రీపతినాయుడు, ఎఫ్ఎస్ఓ నాగరాజు, కాంట్రాక్టర్ కొల్లం పుల్లయ్య ఉన్నారు.

స్కాలర్‌షిప్‌నకు ఎంపిక

ఉయ్యాలవాడ : నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్‌నకు స్థానిక మోడల్‌స్కూల్‌కు చెందిన ఆరుగురు విద్యార్థులు ఎంపియ్యారని ప్రిన్సిపాల్ నూర్జహాన్ తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ పాఠశాలకు చెందిన నాగనితీష్‌రెడ్డి, చాంద్‌బాషా, నాగజగదీష్, రోహిణి స్వేత, సతీష్‌జోయల్, మధుసూధన్ ఎంపికయ్యారని చెప్పారు.

నివాళి

చాగలమర్రి: మండలంలోని శెట్టివీడు గ్రామానికి చెందిన సీనియర్ వైఎస్సార్‌సీపీ నాయకురాలు వెంకటసుబ్బమ్మ సోమవారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించి, సంతాపం వెలిబుచ్చారు. కుమార్ రెడ్డి, మనోహర్‌రెడ్డి, గణేష్ రెడ్డి, రమణ నివాళులర్పించారు.

ముగిసిన ప్రతిష్ఠోత్సవాలు

ఉయ్యాలవాడ : మండలంలోని ఇంజేడు, కొండుపల్లె గ్రామాల్లో నూతనంగా నిర్మించిన గంగమ్మ ఆలయాల్లో విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు సోమవారం మహా పూర్ణాహుతితో ముగిశాయి. వేద పండితులు వెల్లాల వెంకట శేషయ్య శర్మ ఆధ్వర్యంలో ప్రాతః కాలపూజ, న్యాస హోమాదులు, కక్షజ్వాల, కళశ ఉద్వాసన, కుంభాభిషేకం, మహా మంగళహారతి చేపట్టారు. అనంతరం భక్తులకు అమ్మవారి దర్శన భాగ్యం కల్పించారు.

అభివృద్ధి పనుల ప్రారంభం

నంద్యాల(సిటీ): పట్టణంలోని 36వ వార్డులో నూతనంగా రూ.8 లక్షలతో సీసీ డ్రైన్లు, కల్వర్టుల నిర్మాణం పూర్తవడంతో కౌన్సిలర్ నాగిని రవిసింగారెడ్డి సోమవారం వైస్ చైర్మన్ పాంశావలి, మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు, ఎంహెచ్ఓ డాక్టర్ అంకిరెడ్డి, కౌన్సిలర్లు మనోరంజని, అనురాధ, శోభారాణి పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కరించండి

ఉయ్యాలవాడ : నెల నుంచి మంచినీరు సరఫరా లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని బోడెమ్మనూరు గ్రామ ఎస్సీ కాలనీవాసులు వాపోయారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి గ్రామానికి చెందిన శ్రీరాములు, బాల ఓబులేస్, సుంకన్న, సూర్యకుమార్ ఏఓ సత్యన్నకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ కుళాయిలకు నీరు రావడం లేదని గ్రామంలోని సచివాలయం వద్దకు వెళ్లి పలు మార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు.

ఇద్దరి బలవన్మరణం

దొర్నిపాడు: అనారోగ్యం కారణంగా జీవితంపై విరక్తి చెంది బావిలో దూకి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సోమవారం దొర్నిపాడులో జరిగింది. ఎస్ఐ తిరుపాల్ తెలిపిన మేరకు వివరాలు.. బుర్రారెడ్డిపల్లె గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ (37) గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో తాగుడుకు బానిస అయ్యాడు. ఆదివారం సాయంత్రం ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లి పోయాడు. భార్య నాగలక్ష్మి ఎంత వెదికిన కనిపించక లేదు. అయితే సోమవారం దొర్నిపాడులోని బావిలో శవం తేలడంతో లక్ష్మీనారాయణగా గుర్తించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

కడుపునొప్పి తాళలేక..

నంద్యాలటౌన్: మండలంలోని రైతునగరం గ్రామానికి చెందిన భరత్ కుమార్ రెడ్డి (26) సోమవారం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తాలూకా ఎస్ఐ నాగరాజు తెలిపిన వివరాల మేరకు.. మృతుడు బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. ప్రస్తుతం వర్క్‌ఫ్రం హోమ్‌లో భాగంగా ఇంటి వద్దే ఉంటి నుంచి పని చేస్తున్నాడు. కొంత కాలంగా కడుపు నొప్పితో బాధపడుతున్న భరత్‌కుమార్‌రెడ్డి సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

బొప్పాయి రైతుకు ఊరట

- బొప్పాయి పండుకు తగ్గిన గిరాకీ
- వైరస్‌తో పడిపోయిన దిగుబడి
- బొప్పాయి పాల సేకరణతో రైతులకు లాభం
- కేజీ పాలు రూ.60 నుంచి రూ.200 చెల్లింపు
- ఎకరాల ప్రకారం లీజుకు తీసుకుంటున్న వ్యాపారులు
- మహారాష్ట్ర, కోయంబత్తూరు నుంచి కొనుగోలుదారుల రాక



బొప్పాయి పాలను డ్రమ్ముల్లోకి మారుస్తున్న దృశ్యం



పాల కోసం చెట్టు కింద ప్లాస్టిక్ పట్ట ఉంచిన దృశ్యం



బొప్పాయ కాయలకు గాట్లు వేయడంతో పాలు వస్తున్న దృశ్యం

చాగలమర్రి: ఇటీవల బొప్పాయి పండ్ల వినియోగం పెరగడంతో పండ్లకు గిరాకీ పెరిగింది. బొప్పాయి పండ్లు పలు రాకాల వ్యాధులకు ఔషధంగా పని చేస్తాయని వైద్యులు పేర్కొంటుండటమే ఇందుకు కారణం. డెంగీ, కోవిడ్ వ్యాధుల భారిన పడిన వారు బొప్పాయి పండు విరివిగా తినాలని సూచిస్తున్నారు. అంతే కాకుండా బొప్పాయి ఆకు రసం కూడా సేవించవచ్చని కొందరు వైద్యులు చెబుతున్నారు. ప్రస్తుతం బొప్పాయికి మార్కెట్‌లో డిమాండ్ తగ్గింది. అలాగే పంటకు వైరస్ సోకడంతో దిగుబడి పడిపోవడమే కాకుండా నాణ్యత కూడా తక్కువగా ఉంది. ఇక ఢిల్లీ మార్కెట్‌లో గిరాకీ అనుకున్నంత లేకపోవడంతో ఎగుమతులు తగ్గాయి. దీంతో టన్ను ధర రూ. 32వేల నుంచి రూ.8వేలకు పడిపోయింది. అయితే నష్టాల్లో ఉన్న రైతులకు బొప్పాయి పాల సేకరణతో కొంత ఉపశమనం కలుగుతోంది.

ఇలా సేకరిస్తారు..

బొప్పాయి పాల సేకరణకు మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రంలోని కోయంబత్తూరుకు చెందిన కొందరు వ్యాపారులు వస్తున్నారు. కేజీ పాలను రూ.60 నుంచి రూ.200 వరకు కొంటున్నారు. ఈ పాలను ఔషధాల తయారీలో వినియోగిస్తున్నారని వారు చెబుతున్నారు. బొప్పాయి పండ్ల ఎగుమతి చేసే ఏజెంట్ సాయి మాట్లాడుతూ ఢిల్లీలో బొప్పాయి పండ్లకు అధికంగా డిమాండ్ ఉంటుందని, ఇటీవల బొప్పాయి పాలకు డిమాండ్ నెలకొందని చెబుతున్నారు. కాగా పది మంది కూలీలు రోజుకు 50 నుంచి 75 కేజీల బొప్పాయి పాలను సేరకరించగలరు. వైరస్ సోకి పూర్తిగా దెబ్బతిన్న బొప్పాయి పంటను ఎకరాకు రూ.10 వేలు, పాక్షికంగా దెబ్బతిన్న పంటను ఎకరాకు రూ.15 వేలు చెల్లించి కొందరు వ్యాపారులు పాలను సేకరిస్తున్నారు. పాక్షికంగా దెబ్బతిన్న ఎకరా పంట నుంచి 75 కేజీలు, బాగా దెబ్బతిన్న పంట నుంచి 50 కేజీల పాలు లభిస్తాయని కూలీలు పేర్కొంటున్నారు. బొప్పాయి కాయలకు బ్లేడుతో మూడు చోట్ల గాట్లు వేస్తారు. పాలు కారే సమయంలో చెట్టు కింది భాగంలో ప్లాస్టిక్ పట్ట వేస్తారు. అయితే పాలను సేకరించే సమయానికి అవి ముద్దగా మారిపోతాయి. వాటిపై నీళ్ల చల్లి డ్రమ్ములోకి మార్చి ఎగుమతి చేస్తారు. అయితే పాలు కారిపోయిన తరువాత కాయలు పనికి రాకుండా పోతాయి.

బొప్పాయి పాలు సేకరిస్తున్నాం



ప్రతి రోజూ ఒక ఏకరా పంటలో నాణ్యతను బట్టి 30 నుంచి 50 కేజీల పాలను సేకరిస్తాం. కేజీ పాలకు రూ.25 కమిషన్ ఇస్తూ, భోజన సదుపాయం కూడా ఏజెంట్ కల్పిస్తున్నారు.

– చెంగయ్య, కూలీ

ఆరేళ్ల నుంచి పాలు సేకరిస్తున్నాం



ఈ పాలను సేకరించిన తరువాత బొప్పాయి కాయ ఉపయోగపడదు. పాల సేకరణ వృత్తిని ఆరు సంవత్సాల నుంచి చేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నాం. గతంలో ఈ పంట దిగుబడి 3 నెలల కాలంలో మాత్రమే వచ్చేది. ప్రస్తుతం నవంబరు నుంచి జనవరి వరకు వైఎస్సార్ కడప జిల్లాలో, ఉమ్మడి కర్నూల్ జిల్లాలో ఫిబ్రవరి నుంచి మే వరకు, జూలై నుంచి డిసెంబర్ వరకు ప్రకాశం జిల్లాలో పంట వస్తుంది.

– చంద్రుడు, కూలీ

బొప్పాయి పాలతో నష్టాలు తగ్గాయి



మా గ్రామంలో రైతులు ఎక్కువగా అరటి, బొప్పాయి పంటలు సాగు చేస్తారు. ఈ పంటల సాగుకు ఎక్కువ మొత్తంలో పెట్టుబడి అవసరమవుతుంది. ప్రతి ఏడాది ప్రకృతి వైపరీత్యాల వల్లనో, తెగుళ్ల వల్ల నష్టం వాటిల్లుతుంది. అయితే బొప్పాయి పాల సేకరణతో కొంత మేర నష్టం పూడ్చుకోగలుగుతున్నాం.

– ముక్కెర చెన్నారెడి, రైతు, చిన్నవంగలి

రేపు మాన్యం కౌలుకు వేలం

శిరివెళ్ల: ఈ నెల 7వ తేదీన గోవిందపల్లెలోని శ్రీ గౌరీమల్లేశ్వరస్వామి, ఆంజనేయ స్వామి ఆలయాలకు చెందిన మాన్యం కౌలుకు బహిరంగ వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు ఈఓ స్వర్ణముఖి, చైర్మన్ శివచంద్రారెడ్డి సోమవారం తెలిపారు. వేలంలో పాల్గొనే వారు రూ. 5 వేలు డిపాజిట్ చెల్లించాలని సూచించారు. ఆలయాలకు బకాయిలున్న వారు పాటలకు అనర్హులని స్పష్టం చేశారు.

'జగనన్న గోరుముద్ద'ను పకడ్బందీగా అమలు చేయాలి

నంద్యాల(న్యూటౌన్): పాఠశాలల పునః ప్రారంభం రోజు నుంచే పాఠశాలల్లో జగనన్న గోరుముద్ద పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని డీఈఓ అనురాధ ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. సోమవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ రేషన్ డీలర్ నుంచి బియ్యం, రాగిపిండి, బెల్లం తీసుకొని సిద్ధంగా ఉంచుకోవాలని చెప్పారు. స్టీల్ గ్లాసులను ఎంఈఓ అందజేస్తారని, ఐఎంఎంఎస్ యాప్‌లో రసీదును అప్‌డేట్ చేయాలన్నారు. గుడ్లు, చిక్కీలు, సరఫరా దారుల నుంచి ఇండెంట్ ప్రకారం తీసుకోవాలని చెప్పారు. అలాగే విద్యార్థినులకు శానిటరీ న్యాపికిన్‌లు పంపిణీ చేయాలన్నారు. గోరుముద్ద పథకం పూర్తిస్థాయిలో అమలయ్యేలా ఉప విద్యాశాఖ అధికారులు, ఎంఈలు పర్యవేక్షించాలని ఆదేశించారు. వస్తువలు సేకరణ ఈనెల 10వ తేదీ లోపు పూర్తి చేయాలని సూచించారు.

దోమల నివారణకు కృషి చేయాలి

గోస్పాడు: దోమల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నంద్యాల మలేరియా సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వరరెడ్డి అన్నారు. మలేరియా నివారణ మాసోత్సవం సందర్భంగా సోమవారం గోస్పాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అనంతరం జూలేపల్లెలో ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పరిసరాల శుభ్రతతో ఆరోగ్యానికి భద్రత ఉంటుందన్నారు. రాబోవు వర్షాకాలంలో దోమల పెరిగే అవకాశముందని, అప్రమత్తంగా ఉండాలని చెప్పారు.

పాఠశాలలకు 'విద్యాకానుక'

ఉయ్యాలవాడ : పాఠశాలలు పునః ప్రారంభానికి ముందే విద్యార్థులకు జగనన్న విద్యా కానుకను అందించాలనే లక్ష్యంతో ప్రత్యేక వాహనాల ద్వారా ఆయా పాఠశాలకు చేరవేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఎంఈఓ అనురాధ తెలిపారు. సోమవారం స్థానిక మోడల్‌స్కూల్‌లో నిల్వ చేసిన పాఠ్యపుస్తకాలు, బెల్టులు, యూనిఫాం తదితర వాటిని మండలంలోని నర్సిపల్లె, హరివరం, ఎస్.కొత్తపల్లె, అల్లూరు, మాయలూరు, ఉయ్యాలవాడ గ్రామాల్లోని 9 పాఠశాలలకు తరలించారు. గతంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఎమ్మార్సీ కార్యాలయానికి వచ్చి తీసుకెళ్లేవారు. ఈ ఏడాది ఉపాధ్యాయులకు వ్యయప్రయాసాలు లేకుండా ప్రభుత్వమే వాహనాలను ఏర్పాటు చేసి పాఠశాలలకు చేర్చే బాధ్యత తీసుకుందని ఎంఈఓ స్పష్టం చేశారు. సీఆర్పీలు సిద్ధమ్మ, లక్ష్మీదేవి, లక్ష్మిరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ శాస్త్ర సాంకేతిక మండలి, డీఈఓ ఆదేశాల మేరకు జిల్లా సైన్స్ కో ఆర్డినేటర్ కేవీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా డీఎఫ్ఓ వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ చక్రధర్ రెడ్డి, ఇంటర్మీడియెట్ జిల్లా అధికారి సునీత హాజరయ్యారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వ, డ్రాయింగ్ పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి మెమొంటో ప్రశంసా పత్రాలు అందజేశారు.

పోటా పోటీగా వేలాలు

శిరివెళ్ల: గుండంపాడు శ్రీ వేణుగోపాల స్వామి ఆలయ మాన్యం కౌలు వేలం పాటలు సోమవారం పోటా పోటీగా జరిగాయి. ఆలయ చైర్మన్ గంగవరపు శివరామిరెడ్డి అధ్యక్షతన జరిగిన వేలం పాటల్లో ఆలయానికి భారిగా ఆదాయం సమకూరింది. ఆలయకున్న 62 ఎకరాలకు వేలం వేయగా రూ.9.22 లక్షలు వచ్చింది. గతేడాది రూ.6.62 లక్షలు మాత్రమే పలికింది. ఆలయ ఈఓ వేణునాథరెడ్డి, పర్యవేక్ష్యకుడు నరసయ్య, సర్వనరసింహస్వామి ఆలయ చైర్మన్ రామంజనేయరెడ్డి, రైతు సంఘం నాయకులు ప్రతాపరెడ్డి, పుల్లారెడ్డి పాల్గొన్నారు.

'గోరుకల్లు'కు మరమ్మతులు చేయాలి

నంద్యాల(న్యూటౌన్): గోరుకల్లు రిజర్వాయర్ ఆనకట్టకు వెంటనే మరమ్మతులు చేయించాలని, లేకపోతే కట్ట మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్ తెలిపారు. సోమవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్షాలు పడితే నీటి నిల్వ సాధ్యం కాదన్నారు. రామచంద్రుడు, భాస్కర్ పాల్గొన్నారు.

సీడ్ బాల్స్ పంపిణీ

నంద్యాల టౌన్: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ సోమవారం సీడ్ బాల్స్, సీడ్ పెన్స్ పంపిణీ చేశారు. సొసైటీ జిల్లా మెంబర్ మాట్లాడుతూ సీడ్ బాల్స్, సీడ్ పెన్స్ పర్యావరణానికి ఎంతగానో సహకరిస్తాయన్నారు. జాయింట్ కలెక్టర్ నిశాంతి, డీఆర్ఓ పుల్లయ్య, జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రావు పాల్గొన్నారు.

ఫ్యామిలీ పెన్షన్ ఇవ్వాలి

నంద్యాల(అర్బన్): ఎల్ఐసీ, జనరల్ ఇన్సూరెన్స్ పెన్షనర్లకు 30శాతం ఫ్యామిలీ పెన్షన్ ఇవ్వాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్‌ను కోరినట్లు ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి తెలిపారు. ఎల్ఐసీ సంఘాల నాయకులు రమేష్, రంగారావు, శేషగిరి, ఉమామహేశ్వరరెడ్డి సోమవారం ఎంపీ పోచాను కలిసి బీమా రంగం సమస్యలు పరిష్కరించాలని కోరారు. 2019లో ఎల్ఐసీ యాజమాన్యం, 2021లో జనరల్ ఇన్సురెన్స్ సంస్థల య ఎంపీ స్పందిస్తూ సమస్యలపై ఇది వరకే కేంద్ర మంత్రికి లేఖ రాశానన్నారు.

సంగమేశ్వరం రెస్టారెంట్‌కు బహిరంగ వేలం

నంద్యాల(అర్బన్): కొత్తపల్లె మండలం సంగమేశ్వరం వద్దనున్న పర్యాటక శాఖ రెస్టారెంట్ వార్షిక అద్దె కేటాయింపుపై ఈనెల 15న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు జిల్లా పర్యాటక శాఖ అధికారి సత్యనారాయణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రైవేటు వ్యక్తులు, సంస్థలకు వార్షిక అద్దెపై బహిరంగ వేలం నిర్వహిస్తున్నామని, ఆసక్తి గల వారు ఈనెల 15లోపు రూ.2వేలు ధరావత్తు చెల్లించి జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని మొదటి అంతస్తులో నిర్వహించే వేలంలో పాల్గొనాలని కోరారు. వివరాలకు సెల్ : 7995087089, 9121144105 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

గిరిజనుల విద్యకు ప్రాధాన్యతనివ్వాలి

నంద్యాల(అర్బన్): దళిత గిరిజన, వెనుకబడిన కులాల విద్యార్థుల విద్యకు ప్రభుత్వాలు ప్రాధాన్యతను ఇవ్వాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండువీరయ్య మాదిగ కోరారు. విద్యకు దూరమైన దళిత గిరిజనుల విద్యార్థులను గుర్తించి ప్రత్యేక విద్యాబోధన కల్పించాలని, షెడ్యూల్ కులాల కార్పొరేషన్లకు నిధులు విడుదల చేయాలని కోరుతూ సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద ఎమ్మార్పీఎస్ నాయకులు ధర్నా నిర్వహించి డీఆర్ఓ పుల్లయ్యకు వినతి పత్రం అందజేశారు.

వసతులు కల్పించాలి

నంద్యాల(న్యూటౌన్): ప్రభుత్వాసుపత్రిలో మంచి నీటి వసతి కల్పించాలని ఏఐవైఎఫ్ నాయకులు కోరారు. ఈ మేకు సోమవారం స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రంఅందజేశారు. ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని, గర్భిణులకు ఆపరేషన్లు చేసే వార్డులో పురుషులను డ్యూటీలు వేయరాద కోరారు. ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాముడు, విష్ణు, శశి, సురేష్ పాల్గొన్నారు.

మున్సిపల్ స్పందనకు మూడు వినతులు

నంద్యాల(సిటీ): నంద్యాల మున్సిపల్ కార్యాలయంలో అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి మూడు ఫిర్యాదులు వచ్చాయి. ఆయన మాట్లాడుతూ రోజూ పట్టణంలోని సచివాలయాల్లో నిర్వహిస్తున్న స్పందనతో మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించే స్పందనకు వినతులు తగ్గాయని చెప్పారు.

తోటల పెంపకానికి ప్రోత్సాహం

ఉయ్యాలవాడ : ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వం ప్రోత్సాహం కల్పిస్తుందని ఏపీఓ రవిప్రకాష్ తెలిపారు. సోమవారం స్థానిక గ్రామ సచివాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 5 ఎకరాల్లోపు ఉన్న సన్న, చిన్నకారు రైతులు మామిడి, చీని, జామ, నిమ్మ, సపోటా, దానిమ్మ, కొబ్బరి, మునగ, సీతాఫలం, డ్రాగన్ ఫ్రూట్స్, గులాబీ, మల్లెపూలు సాగు చేసుకునేందుకు వంద శాతం సబ్సిడీ ఇస్తుందన్నారు. గ్రామ వలంటీర్లు తమ పరిధిలోని కుటుంబ యజమానులకు ఈ విషయాలను తెలియజేయాలని సూచించారు. సర్పంచ్ ఓబులేస్, పంచాయతీ కార్యదర్శి జయరామిరెడ్డి పాల్గొన్నారు.

ఇంగ్లిష్ పరీక్షకు 453 మంది గైర్హాజరు

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల జిల్లాలో జరుగుతున్న పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా సోమవారం జరిగిన ఇంగ్లిష్ పరీక్షకు 453 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని డీఈఓ అనురాధ తెలిపారు. పరీక్షకు 1,035 మంది విద్యార్థులకు 582 మంది విద్యార్థులు హాజరయ్యారు. జిల్లాలో 47 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు జరుగుతున్నాయన్నారు. మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, 15 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసినట్లు చెప్పారు.

గురురాజ విద్యార్థుల ప్రతిభ

జిల్లాస్థాయి వ్యాసరచన, డ్రాయింగ్‌పోటీల్లో గురురాజ విద్యార్థుల ప్రతిభ చూపారని డైరెక్టర్ షేక్షావలిరెడ్డి సోమవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖ సంయుక్త నిర్వహణలో జిల్లా స్థాయి వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఇందులో ఈ.శ్రావణి ప్రథమస్థానం, వ్యాసరచనలో నాగకు మారి ద్వితీయ స్థానం సాధించారని చెప్పారు.

ఫీజుల దోపిడీని అరికట్టాలి

కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలని పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్ఎండీ రఫీ కోరారు. సోమవారం డీఈఓ అనురాధను కలిసి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ నంద్యాల జిల్లాలోని ప్రైవేటు విద్యాసంస్థల్లో వివిధ రకాల పేర్లతో జరుగుతున్న ఫీజుల దోపిడీని అరికట్టాలని, జీవోనెం.142ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. నవీన్, అనిల్, షాహిద్, వినయ్, తదితరులు పాల్గొన్నారు. విద్యావ్యాపారానికి తెరలేపిన పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ధనుంజయుడు జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. పుస్తకాలు, షూ, టై, బెల్ట్‌లు, యూనిఫాం కచ్చితంగా తమ పాఠశాలలోనే కొనాలంటున్న యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలనిమీ సందర్భంగా కోరారు.

సేవలను వినియోగించుకోండి

ఉయ్యాలవాడ : గ్రామాల్లోకి వచ్చి వైద్యులు అందజేస్తున్న సేవలను వినియోగించుకోవాలని వైద్యాధికారి రమేష్‌చంద్రబాలాజీ తెలిపారు. ఫ్యామిలీ ఫిజీషియన్‌లో భాగంగా హరివరం గ్రామ సచివాలయంలో సోమవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. మొత్తం 115 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. హెల్త్ సూపర్‌వైజర్ దస్తగిరి, సునీల్‌బాబు, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌బాబు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన అధికారులు

దొర్నిపాడు: ఎంపీడీఓగా సుబ్బారెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఆళ్లగడ్డ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ ఈఓపీఆర్డీగా విధులు నిర్వహిస్తున్న నాగఅనసూయ ఎఫ్ఏసీ ఎంపీడీఓగా ఇంతవరకు విధుల్లో కొనసాగారు. ఆయన రాకతో సుబ్బారెడ్డికి బాధ్యతలు అప్పగించారు. మండలాభివృద్ధికి ప్రతి అధికారి సహకరించాలని ఆయన కోరారు. ఏఓ పార్థసారధి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుప్రియ, గ్రామ పంచాయతీ కార్యదర్శులు నాగర్జున, శ్రీనివాసులు, లక్ష్మయ్య, వెంకటనారాయణ, మహేష్ పాల్గొన్నారు.



సుబ్బారెడ్డిని అభినందిస్తున్న అధికారులు

విధుల్లో చేరిన ఎంపీడీఓ

చాగలమర్రి: ఎంపీడీఓగా మహబూబ్ దౌలా సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఆయన కోవెలకుంట్లలో ఎంపీడీఓగా ఉంటూ సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా పనిచేస్తున్న రుద్రవరం ఈఓపీఆర్‌డీ భాగ్యలక్ష్మి పదోన్నతిపై వైఎస్సార్ కడప జిల్లాకు ఎంపీడీఓగా బదిలి అయ్యారు.



విధుల్లో చేరిన మహబూబ్ దౌలా

వ్యవసాయాధికారిగా..

రుద్రవరం: మండల వ్యవసాయాధికారిగా శ్రీకృష్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ విధులు నిర్వహిస్తున్న జ్యోతి కోవెలకుంట్లకు బదిలీ అయ్యారు. ఆ స్థానం భర్తీ చేసేందుకు ఉన్నతాధికారులు శ్రీకృష్ణ నియమించడంతో ఆయన విధుల్లో చేరారు.



శ్రీకృష్ణ

సంక్షేమ పథకాలతో సంతోషం



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను మహిళకు అందజేస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని 9వ వార్డులో కౌన్సిలర్ దండె నాగమ్మతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాలను వివరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ గ్రామాలు, వార్డుల్లో పర్యటించినప్పుడు గుర్తించిన సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సచివాలయానికి రూ.20లక్షల చొప్పున నిధులు అందజేస్తుందన్నారు. వాటితో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పాంషావలి, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ సిద్ధం శివరాం, గోపాల్, కౌన్సిలర్లు కలాంబాషా, సమ్మద్, విజయ భాస్కర్, మజీద్, నాయకులు జాకీర్ హుసేన్, దండే బుజ్జయ్య, మా బాషా, అమీర్, దండే శీను పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధికి కృషి

శిరివెళ్ల: శ్రీ సర్వ నరసింహస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి తెలిపారు. సోమవారం నలమల్ల అటవీ ప్రాంతంలోని శ్రీ సర్వ నరసింహస్వామి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ దర్మకర్త మండలి సభ్యులు, అర్చకులు ఎంపీకి స్వాగతం పలికారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ధర్మకర్త మండలి సభ్యులు ఆయనను సన్మానించారు. రూ.1.60 కోట్ల టీటీడీ నిధులతో జరుగుతున్న ఆలయ రక్షణ గోడ నిర్మాణ పనులను పరిశీలించారు. చైర్మన్ రేవనూరు రామాంజనేయరెడ్డి పాల్గొన్నారు.



ఎంపీ పోచాను సన్మానించిన దృశ్యం

పర్యావరణాన్ని రక్షిద్దాం

నంద్యాల(సిటీ)/(అర్బన్): పర్యావరణాన్ని రక్షిద్దామని 36వ వార్డు కౌన్సిలర్ నాగినిరెడ్డి అన్నారు. సోమవారం అంతర్జాతీయ పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వార్డులో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మార్కెట్ యార్డులో మొక్కలు నాటారు. మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు. నందమూరినగర్‌లోని నిరాశ్రయుల వసతి గృహం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు.

ఆళ్లగడ్డ: మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని రుద్రవరం రేంజ్ అధికారి శ్రీపతినాయుడు నాయుడు అన్నారు. సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం దినోత్సవం సందర్భంగా అహోబిలం రిజర్వు ఫారెస్ట్ సమీపంలోనున్న నవనారసింహ క్షేత్రాల ఆవరణలో ప్లాస్టిక్ వస్తువులు, పాలిథిన్ కవర్లు ఏరి వేశారు. అనంతరం శీతల్ బేష్ క్యాంపు సమీపంలో మొక్కలు నాటారు. అహోబిలం జీపీఏ సంపత్, డీఆర్వో ముక్తార్ బాషా పాల్గొన్నారు. అలాగే..ఆళ్లగడ్డలో మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

రుద్రవరం: పచ్చదనాన్ని పెంపొందించి పర్యావరణాన్ని పరిరక్షిద్దాం అని రుద్రవరం రేంజి అధికారి శ్రీపతినాయుడు పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సోమవారం ఆయన సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం అటవీ కార్యాలయ ప్రాంగణంలో వివిధ రకాల మొక్కలు నాటి నీరు పోశారు. ఎఫ్ఎస్ఓలు నాగరాజు, రాజెమ్మ,ఎఫ్‌బీఓలు నరసింహారెడ్డి,ఖాన్ ఉన్నారు.

నంద్యాల(న్యూటౌన్): ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని నంద్యాలలోని పీఎస్సీ, కేవీఎస్సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీసీడీఈ సోల్జర్స్, ఎన్ఎస్ఎస్ యూనిట్-1, 2 ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ శశికళ మాట్లాడుతూ పర్యావరణ ఆవశ్యకతను, ప్లాస్టిక్‌ను నివారిద్దామని పిలుపునిచ్చారు. కళాశాలనుప్లాస్టిక్ ఫ్రీ క్యాంపస్‌గా ప్రకటించారు. అందరు కలిసి ప్లాస్టిక్ సంచులను, సీసాలను సేకరించి మున్సిపాలిటీకి అందజేశారు.



ర్యాలీ నిర్వహిస్తున్న కౌన్సిలర్లు, అధికారులు

శిరివెళ్ల: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి కర్తవ్యం కావాలని యర్రగుంట్ల జీటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం కళాశాలలో పర్యావరణ దినోత్సవం సందర్భంగా అధ్యాపకులు, విద్యార్థులు మొక్కలు నాటారు.

చాగలమర్రి: ప్రతి ఒక్కరూ తమ ఇంటి ఆవరణలో మొక్కలను నాటి సంరక్షించి పర్యావరణాన్ని కాపాడాలని ఎంపీపీ వీరభద్రుడు కోరారు. సోమవారం ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా డి.వనిపెంట సెక్షన్ అధికారి పెద్దన్న ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దారు కార్యాలయంలో మొక్కలు నాటారు. తహసీల్దారు విజయకుమార్, వైస్ ఎంపీపీ రఫీ, సర్పంచ్ తోలసమ్మ, ఉప సర్పంచ్ షేక్ సోహెల్ మొక్కలు నాటారు.

ప్లాస్టిక్ సంచులు వద్దు..

నంద్యాల టౌన్: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సోమవారం డీఎంఅండ్‌హెచ్ఓ వెంకటరమణ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు . ఆసుపత్రి ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వల్ల భూతాపం పెరుగుతుందని, బట్ట సంచులను ఉపయోగించటం వలన పర్యావరణం దెబ్బతినకుండా ఉంటుందన్నారు. ఎన్‌సీడీ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ కాంతారావు నాయక్, ఏఓ డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ మాధవీలత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.